క్లుప్తంగా

విద్యార్థులకు కిట్ల పంపిణీ

తాళ్లపూడి: మలకపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బుక్స్, యూనిఫాం, స్కూల్ కిట్లను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీవాసవి ఆధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపాక రాజేశ్వరి, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ ఉబా వెంకట్రావు, ఉప సర్పంచ్ మద్దిపాటి రామారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మోర్త ప్రాథమిక పాఠశాల నంబర్-2లో గురువారం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను హెచ్ఎం ఎస్ఎల్‌వీ ప్రసాదరావు చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వద్దూరు ప్రాథమిక పాఠశాల నెంబర్-2లో ఎస్‌జీటీగా పని చేస్తున్న ఉపాధ్యాయిని కటికల శిరీష, వద్దూరు గ్రామానికి చెందిన దిడ్ల సరస్వతి ప్రోత్సాహంతో రాజమహేంద్రవరం గ్రామానికి చెందిన దిడ్ల సుధీర్ బాబు ఆర్థిక సహకారంతో విద్యార్థిలకు రాత పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

కొవ్వూరు: దేచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతు పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. 11 కేవీ ఐ.పంగిడి ఇండస్ట్రీరియల్ ఫీడర్, దేచెర్ల లోకల్, ధర్మవరం, కాపవరం 11కేవీతోపాటు త్రివేణి 11కేవీ ఎస్ఎంసీఎల్, గౌరీపట్నం ఇండస్ట్రీరియల్ ఏరియాకు, దుద్దుకూరు 11కేవీ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని పురుషోత్తపల్లి, కాటకోటేశ్వరం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ విషయాన్ని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పెరవలి: మల్లేశ్వరం ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. మల్లేశ్వరం పీడర్ పరిధిలో అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, నల్లాకులవారిపాలెం, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

కొవ్వూరు: పట్టణంలో సంస్కృత పాఠశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ర్యాగింగ్, మాదక ద్రవ్యాల వాడకానికి విద్యార్థులు దూరంగా ఉండాలని న్యాయవాది రాముల నాగ మునీంద్ర సూచించారు. తోటి విద్యార్థులను ర్యాంగింగ్ చేస్తే చట్ట ప్రకారం శిక్ష లు పడతాయని వివరించారు. మాదక ద్రవ్యాలు తాగడం, వాడడం, అమ్మకం చట్ట రీత్యా నేరమని సూచించారు. ప్రధానోపాధ్యాయులు గోవర్ధనం శ్రీనివాస మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకు చర్యలు

నిడదవోలు రూరల్: ఎర్రకాలువ ముంపుతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జేడీఏ ఎస్.మాధవరావు తెలిపారు. మండలంలోని సింగవరం, కంసాలిపాలెం గ్రామాల్లో ఎర్రకాలువ ముంపుతో నీటి మునిగిన వరి పొలాలను గురువారం ఆయన పరిశీలించారు. నిడదవోలు మండల పరిధిలో 8,500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

నల్లజర్ల: గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు తెలిపారు. గురువారం నల్లజర్ల శాఖాగ్రంథాలయం, బుక్ డిపో సెంటర్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తణుకులో రూ.1.30 కోట్లు, నర్సాపురంలో రూ.1.28 కోట్లతో నూతన గ్రంథాలయాలను నిర్మిస్తున్నట్టు తెలిపారు. గ్రామ పంచాయతీల నుంచి దాదాపు రూ.9 కోట్లు బకాయిలు వసూలు కావాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లిస్తే మరిన్ని నిర్మాణాలు చేపడతామన్నారు. ఆయనతో పాటు నల్లజర్ల గ్రంథాలయ అధికారి ఏ.వి.రమణ,పుస్తక పంపిణీ కేంద్ర నిర్వాహకులు ఉన్నారు.

మందుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

తాళ్లపూడి: మందుల దుకాణాల్లో అన్ని వివరాలను ఇక నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా డ్రగ్స్ అసోసియేషన్ సెక్రటరీ పిండి గణపతి తెలిపారు. తాళ్లపూడిలో గురువారం ఆయన మాట్లాడుతూ మంగళగిరి ఆరోగ్యశ్రీ కార్యాలయంలో రాష్ట్ర నూతన ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ డైరెక్టర్ జనరల్ లక్ష్మీషా, డ్రగ్స్ కంట్రోలర్ ఎంబీఆర్ ప్రసాద్, జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్లతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని జిల్లా స్థాయి నాయకులతో సమావేశం బుధవారం నిర్వహించారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో మందుల ఆన్‌లైన్ విధానం, డ్రగ్ లైన్స్ పొందే విధానం, మార్పులు తదితర వాటిపై చర్చించారని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా జాయింట్ సెక్రటరీ నల్లజర్ల బాపిరాజు పాల్గొన్నారు.

రేపు మున్సిపల్ సమావేశం

కొవ్వూరు: స్థానిక పురపాలక సంఘం సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ బావన రత్నకుమారి తెలిపారు. ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించనున్నట్టు తెలిపారు. సభ్యులందరూ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

వరద పోయే.. బురద మిగిలే..



గోదావరి వరద తగ్గిన తర్వాత గోష్పాదక్షేత్రంతో పేరుకుపోయిన బురద



సుందర సాయి ఆలయం ప్రాంగణంలో నిలిచి ఉన్న గోదావరి వరద నీరు



గోష్పాద క్షేత్రంలో రోడ్డుపై నిలిచిన వరద నీరు

- ముంపు నుంచి తేరుకుంటున్న గోష్పాద క్షేత్రం
- మళ్లీ ఎగువన పెరుగుతున్న నీటిమట్టం
- నేడు మళ్లీ ముంపు బారిన పడే అవకాశం

కొవ్వూరు: గోదావరి వరద ముంపు నుంచి గోష్పాదక్షేత్రం తేరుకుంది. మూడు రోజుల నుంచి వరద ముంపులో ఉండడంతో క్షేత్రంలోకి ప్రవేశించడంతో రోడ్లపై ఒండ్రు మట్టి, బురద పేరుకుపోయాయి. ప్రస్తుతం స్నానఘట్టాలు పూర్తిగా ముంపులోనే ఉన్నాయి. వరద ఒడ్డును తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద తగ్గడంతో క్షేత్రంలో ఎక్కడికక్కడే బురద దర్శనమిస్తోంది. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో క్షేత్రంలో స్నానాలకు, ఆలయాల సందర్శనకు ఎవర్నీ అనుమతించడం లేదు. సాయిబాబా ఆలయం ప్రాంగణంలో రెండు అడుగులు మేరకు వరద నీరు నిలిచి ఉంది. క్షేత్రానికి వెళ్లే రోడ్డుపై వరద నీరు నిలిచి ఉంది. మరో వైపు ఎగువన భద్రచలంలో మళ్లీ వరద క్రమక్రమంగా పెరుగుతోంది. దీంతో గోష్పాదక్షేత్రాన్ని మరోసారి వరద ముంచెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు.



కానూరులో నీట మునిగిన ఆయిల్‌పామ్ తోట



ముక్కామలలో గోదావరి వరద



కోసిన బొప్పాయి కాయలను బస్తాలలో నింపుతున్న రైతులు



ముక్కామలలో నీట మునిగి ఉన్న అరటితోట

తగ్గని వరద.. కదలని ముంపు

- ఇంకా వరద నీటిలోనే లంకలు
- గగ్గోలు పెడుతున్న రైతన్నలు

పెరవలి: గోదావరి ఇంకా శాంతించకపోవడంతో లంకలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. పెరవలి మండలంలో 16 కిలోమీటర్లు విస్తరించి ఉన్న గోదావరిలో లంకలు 3 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. గత 4 రోజులుగా వరద తగ్గకపోవడంతో రైతులు పంటలపై ఆశలు వదులుకున్నారు. ఏటిగట్లపై పశువులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ కాలం వెల్లదీస్తున్నాయి. ఎక్కువ నష్టం కలిగిన అరటి, మునగ, బొప్పాయి తోటల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖర్చు ఎక్కువైనా ఎంతో కొంత వస్తుందన్న ఆశతో రైతులు పంట ఉత్పత్తులను ప్రమాదమైనా వెనుకాడకుండా వాటిని తరలిస్తున్నారు. కూరగాయల పంటలు పూర్తిగి కుళ్లిపోయాయి. అక్కడక్కడ ముంపునీరు తగ్గడంతో కొంత పంటను ఒబ్బిడి చేస్తున్నారు.



ఉమ్మిడివారిపాలెం వద్ద నీట మునిగిన కోకో తోట

ఇప్పుడు తగ్గిన గోదావరి 24 గంటల్లో మళ్లీ పెరిగే అవకాశం ఉంది. ధవళేశ్వరం వద్ద గోదావరి వరద 12.58 క్యూసెక్కులు వదలడంతో గోదావరి రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. లంక గ్రామాలైన కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో పంట నష్టం ఎక్కువగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఉద్యాన పంటలపై అప్రమత్తం

ఉద్యానశాఖాధికారి బబిత



ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న అధికారి బబిత

నల్లజర్ల: వర్షాల కారణంగా ఉద్యాన పంటలలో సంరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖాధికారి బబిత రైతులకు సూచించారు. గురువారం వివిధ గ్రామాలలో కూరగాయలు, పండ్ల తోటలను ఆమె పరిశీలించారు. బొప్పాయి మొక్కలు పసుపు రంగులోకి మారడం, కాండం కుళ్లిపోయే లక్షణాలు గుర్తిస్తే రిడోమిల్ 2.0 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎలైట్ మందును 2.0 గ్రాములను లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోయాలన్నారు. పండు ఈగ ఉధృతి నివారణకు మిథైల్ యూజినాల్ ఎరలను ఎకరాకు 10 నుంచి 15 ఏర్పాటు చేస్తే సరిపోతుందన్నారు. ఆయిల్‌ఫామ్ లేత మువ్వలు మునిగినట్టయితే భావిష్టన్ లీటరు నీటిలో 3 గ్రాములు కలిపి మువ్వలో పోసి మొక్కంతా తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కొబ్బరి తోటలలో వారానికి మించి నీరు నిల్వ ఉన్నట్టయితే కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాముల మందును కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకులు, గెలలపై పొటాషియం నైట్రేట్ 0.1 శాతం మందును పిచికారీ చేయాలన్నారు. అరటి మూడు నెలలు కంటే తక్కువ వయస్సు మొక్కలు 4, 5 రోజులు నీటిలో ఉంటే వేరు కుళ్లి మొక్కలు చనిపోతాయన్నారు. 6 నెలలు దాటిన తోటలలో నీరు నిల్వ ఉన్నట్టయితే తేలికపాటి దుక్కు చేసి ఒక్కో మొక్కకు 100 గ్రాముల యూరియా, 80 గ్రాముల పొటాష్ 20, 25 రోజుల వ్యవధిలో రెండు సార్లు వేయాలన్నారు. 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను ఒక లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో 3 సార్లు పిచికారీ చేయాలన్నారు. సిగటోక ఆకుమచ్చ తెగులుకు ప్రోపికోనజోల్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దుంపకుళ్లుకు 25 గ్రాముల బ్లీచింగ్ పౌడి ఒక లీటరు నీటిలో కలిపి మొక్క మొదలులో పోయాలన్నారు. కూరగాయలు, పసుపు సాగుపై సస్యరక్షణ చర్యలు వివరించారు.

కొవ్వాడ కాలువ పరిశీలన



గంగోలు చెరువు వద్ద కొవ్వాడ కాలువ గట్టును పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ

గోపాలపురం: వరద ముంపునకు గురైన ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ అధికారులకు సూచించారు. గంగోలు పెద్ద చెరువు వద్ద కాలువ గట్టుపై వేసిన ఇసుక బస్తాలను గట్టు పటిష్టతను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడ రిజర్వాయర్ నుంచి దిగువకు వచ్చే వరద నీరు వల్ల వేలాది ఎకరాలు పంట నీట మునిగిందన్నారు. శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. గ్రామాల్లో కొవ్వాడ కలువ వరద తగ్గుముఖం పట్టిందన్నారు. ఈయన వెంట తహసీల్దార్ డి.వనజాక్షి, డీటీ కె.కృష్ణ, ఇరిగేషన్ ఏఈ సీహెచ్ భాస్కరరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వరద ముంపులో 8,800 ఎకరాలు

- నష్టాన్ని ప్రాథమికంగా గుర్తించిన అధికారులు
- ముంపులోనే 400 హెక్టార్లలో ఉద్యాన పంటలు

కొవ్వూరు: డివిజన్ పరిధిలో 125 గ్రామాల్లో పంటలను వరద ముంపు ఇంకా వీడలేదు. గురువారం సాయంత్రానికి అధికారిక లెక్కల ప్రకారం 8,800 ఎకరాల్లో పంటలు ముంపులోనే ఉన్నట్టు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. దీనిలో నాట్లు వేసిన నలభై రోజులకు పైబడిన 6,307 ఎకరాల్లో వరి పూర్తిగా దెబ్బతిన్నట్టు అధికారులు నిర్ధారించారు. నాట్లు వేసి 40 రోజుల్లోపు పూర్తయిన పంట 1,952 ఎకరాల్లో దెబ్బతిన్నట్టుగా గుర్తించారు. ముంపు ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాతే నష్ట తీవ్రతను పూర్తి స్థాయిలో అంచనా వేసే అవకాశం ఉంది. వరద ముంపు రోజుల తరబడి ఉండడంతో ఇప్పటి వరకు అందించిన సమాచారం మేరకు 8,259 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. ప్రధానంగా ఎర్రకాలువ ప్రభావంతో నిడదవోలు మండలంలో అత్యధికంగా 3,392 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. ఉండ్రాజవరంలో 2వేల ఎకరాలు, పెరవలి మండలంలో 386 ఎకరాలు,



ముంపులో ఉన్న పంట పొలాలు

కొవ్వూరు మండలంలో 101 ఎకరాలు, చాగల్లులో 250, దేవరపల్లిలో 900 ఎకరాలు దెబ్బతిన్నాయి. తాళ్లపూడిలో 586 ఎకరాలు ముంపు బారిన పడింది. డివిజన్ పరిధిలో మొత్తంగా నలభై రోజుల లోపు నాట్లు వేసిన దెబ్బతిన్న 1,952 ఎకరాల్లో నారు దొరికితే దీనిలో కొంత విస్తీర్ణంలో మళ్లీ నాట్లు వేసుకునే అవకాశం ఉంది. నాట్లు వేసి నలభై రోజులు పైబడి తర్వత ముంపు బారిన పడి దెబ్బతిన్న పంటను తిరిగి నాట్లు వేసుకునే అవకాశం తక్కువేనని చెప్పవచ్చు. రెండోసారి రైతులు నాట్లు వేసుకోవాలంటే పెట్టుబడి భారంతో పాటు నారు కొరత ఉంటుంది. వెదజల్లు పద్ధతి లేదా ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు వేసుకోవాల్సి ఉంటుంది. డివిజన్‌లో 400 హెక్టార్లుకు పైగా ఉద్యాన పంటలు ముంపులోనే ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.

మృతుడి కుటుంబానికి రూ.50 వేల ఆర్థిక సాయం

తాళ్లపూడి: పైడిమెట్టకు చెందిన ఫొటోగ్రాఫర్ పసలపూడి సంజీవ్ ఇటీవల మృతి చెందాడు. గురువారం ఆయన కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పోసిన వీరేంద్రకుమార్ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. డాగురే సురక్ష యోజన ఫొటో, వీడియో గ్రాఫర్స్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.50 వేల చెక్కును సంజీవ్ కుటుంబ సభ్యులకు అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా ప్రొఫెషనల్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మధు శ్రీనివాస్, రాజమహేంద్రవరం ఫొటోగ్రాఫర్స్ రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరి శ్రీను, డాగురే సురక్ష యోజనచారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బెజగం కోటేశ్వరరావ, కోశాధికారి నామన వెంకట భాస్కర్, తప్పెట్ల ప్రభాకర్, స్థానిక ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు పరస రవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇసుక అక్రమ తరలింపుపై కేసు

నిడదవోలు రూరల్: పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద నుంచి అక్రమంగా ఇసుక తరలించడంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ గురువారం తెలిపారు. పందలపర్రులో నిల్వ చేసిన ప్రభుత్వ ఇసుకను గత వారం రోజులుగా రాత్రి వేళలో గుర్తుతెలియని వ్యక్తులు లారీల్లో లోడ్ చేసుకుని తరలించినట్లు వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కొవ్వూరు: పట్టణంలో ఎరినమ్మ స్నానఘట్టం సమీపంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న యనాద కాలనీకి చెందిన వ్యక్తి మంగర వెంకన్నను గురువారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. అతని వద్ద 15 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం

తాళ్లపూడి: వర్షాలకు తోడు కొవ్వాడ కాలువ వరద ముంచెత్తడంతో వరి చేలు నీట మునిగి కుళ్లిపోతున్నాయి. రైతులకు తీవ్ర నష్టం మిగిల్చింది. తాళ్లపూడి మండలంలో కొవ్వాడ కాలువ పూర్తిగా తగ్గుముఖం పట్టింది. నీట మునిగిన పలు పంట పొలాలనుంచి నీరు బయటకు వెళుతుంది. మండలంలో సుమారు 1448 ఎకరాల్లో వరి చేలు ఇప్పటికీ నీటిలోనే ఉన్నాయి. నీరు ఇంకా పల్లపు ప్రాంతాల్లో నిలిచిపోయింది. తాళ్లపూడి, తిరుగుడుమెట్ట, పెద్దేవం, పైడిమెట్ట రాగోలపల్లి, తుపాకుల గూడెం, బయ్యారం, అన్నదేవరపేట, నల్లమిల్లిపాడు గ్రామాల్లో సుమారు 700 వరకు ఎకరాల్లో వరి చేలకు పూర్తిగా పంటలకు నష్టం వాటిల్లింది. ఎకరాకు సుమారు రూ.20 వేల వరకు నష్టం వాటిల్లినట్టు రైతులు చెబుతున్నారు.

300 ఎకరాల్లో పంటలకు నష్టం

పెరవలి: గోదావరి వరద కారణంగా మండలంలో 300 ఎకరాల్లో పంటలు నష్టం వాటిల్లిందని ఉద్యానవన అధికారి సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. గోదావరి వరద పూర్తిగా తగ్గినప్పుడే పంట నష్టాలను అంచనా వేస్తామని తెలిపారు. ప్రస్తుతం ప్రాథమిక అంచనా ప్రకారం 300 ఎకరాలుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, అధికారులు పాల్గొన్నారు.



కాకరపర్రులో నీట మునిగిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

చాగల్లు: కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి, వడ్డీ లేని పంట రుణాలు, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక పాటేమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం మండల సదస్సును గురువారం నిర్వహించారు.ఈ సదస్సుకు కడారి ప్రభాకరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులు నష్టాల్లో ఉన్నారని, భూ యజమాని అంగీకారంతో లేకుండా పంట సాగుదారు హక్కు పత్రాలు, రుణాలు అందించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

పెరవలి: మహిళలు అన్ని రంగాల్లో అబివృద్ధి సాధించినప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని సీడీపీఓ కె.శ్రీలక్ష్మి తెలిపారు. పెరవలి మండలం కాపవరం, మల్లేశ్వరం గ్రామాల్లో బేటీ బచావో బేటి పడావో కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, యువతులు సంపూర్ణ ఆరోగ్యం లభించాలంటే పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. సూపర్ వైజర్ బాల సరస్వతి, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీలక్ష్మి

రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

నిడదవోలు: పట్టణంలోని సామాజిక ఆరోగ్యం కేంద్రం వద్ద రోగులు, సహాయకుల కోసం ఆర్టీసీ బస్సులను నిలిపివేయాలని సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు కోరారు. రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ నిడదవోలు ఆర్టీసీ డీఎం శ్రీరామ్ కుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆయనతోపాటు కె.గోపి, యూషఫ్, షాహీ, సురేష్ తదితరులు ఉన్నారు.

అపరాధ రుసుం లేకుండా పొగాకు కొనుగోళ్లు

కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల జారీ

దేవరపల్లి: పొగాకు బోర్డు ఇచ్చిన అనుమతికి మించి అదనంగా పండించిన పొగాకుపై విధిస్తున్న అపరాధ రుసుం రద్దు చేస్తున్నట్టు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2023-24 సంవత్సరంలో పొగాకు తోటలు వేసిన అనంతరం మిచాంగ్ తుపాను కారణంగా తోటలు దెబ్బతిన్నాయి. తిరిగి రైతులు పొగాకు నాట్లు వేశారు. అయితే పొగాకు బోర్డు అనుమతించిన దానింటే ఎక్కువ విస్తీర్ణంలో పంట సాగు చేశారని, దీని అమ్మకాలపై పొగాకు బోర్డు 5 శాతం అపరాధ రుసంతో పాటు రెండు శాతం సర్వీస్ చార్జీలు వసూలు చేస్తోంది. అపరాధ రుసం రద్దు చేసి, పొగాకు వేలం కేంద్రాల్లో పంటను అమ్ముకోవడానికి అనుమతి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌లోని పొగాకు రైతులు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవర ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ద్వారా ఇటీవల ఢిల్లీలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూస్ గోయల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఈ నెల రెండో తేదీన కేంద్ర మంత్రి ఎపీయూష్ గోయల్ హైదరాబాద్‌లో పొగాకు రైతుల ప్రతినిధులు, బోర్డు చైర్మన్, అధికారులతో నిర్వహించిన సమావేశంలో అపరాధ రుసం రద్దు చేయనున్నట్టు హామీ ఇచ్చారు. ఈ మేరకు అదనంగా పండిన పొగాకు అమ్మకాలను వేలం కేంద్రాల్లో జరుపుకొనేందుకు అనుమతి ఇస్తూ, పెనాల్టీ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎట్ట కేలలకు సమస్య పరిష్కారమైంది. దీంతో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఎంపీలు పురందేశ్వరి, పుట్టా మహేష్ కుమార్, బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్ కుమార్, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



దేవరపల్లి వేలం కేంద్రంలో కొనుగోలు చేస్తున్న పొగాకు

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

ఉండ్రాజవరం: బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని, ప్రోత్సహిస్తే చట్ట రీత్యా నేరస్తులవుతారని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. చిలకపాడు గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం స్టాప్ డయేరియా, బేటి బచావో-బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాలికలు అక్రమ రవాణా, బాల్య వివాహలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంచార వాహనంపై రైతులకు అవగాహన

నల్లజర్ల: డాక్టరు వైఎస్సార్ విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు వారు ఏర్పాటు చేసిన సంచార ఉద్యాన విస్తరణ సేవల వాహనం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సింగరాజుపాలెంలోని ఉద్యాన రైతులకు నీట మునిగిన వివిధ పంటలపై అవగాహన కల్పించారు. అధిక వర్షాలకు గురైన బొప్పాయ, కొబ్బరి, వరి, కూరగాయల పంటలలో చేపట్టాల్సిన తక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో పంటలను ఆశించే చీడపీడలు నివారించడంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టరు వి.దీప్తి, డాక్టరు రాఘవేంద్రరెడ్డి దృశ్యమాధ్యమాలపై వివరించారు. డాక్టరు వైఎస్సార్ విశ్వవిద్యాలయం డాక్టరు కరుణశ్రీ పాల్గొన్నారు.